# పక్షి

"జరిగినంతవరకూ జరగతాదిలే చిన్నాయినా... యింక మాత్రం నన్నాడికి పొమ్మని చెప్పబాకండి... నాకా సౌకిర్యాలూ వద్దు... వోళ్ళమాటలూ వద్దు..." ఖండితంగా వున్న కొండమ్మ గొంతు విని డీలాపడ్డాడు తిరిపాలు.

మొదులే కొత్త పండక్కి అమ్మిని తీసకరావాల... అల్లుడికి కొత్తగుడ్డలు కొనియ్యాల... ఎట్ట ఎల్లబోద్దా ఈ పండగని సస్తావుంటే ఈయమ్మి నీలుగుడు మాటలూ... ఈయమ్మి కతా ఆ నాయుడోళ్ళింట్లోగూడా పదిరూపాయలు పుట్టేట్టుగా లేవు. కూర్చున్న నులకమంచంమీది నుండి పైకిలేవాలని ప్రయత్నించి నరాలు గుంజినట్టయి అట్నే వెనక్కి వాలుకున్నాడు తిరిపాలు.

గుడిసె బయటున్న పొయ్యిమీద అన్నంకింద ఎక్కేస్తా కుతకుత వుడికిపోయింది మీరమ్మ.

"యాందివే నువుజెప్పేది? పెద్దోళ్ళు, నీకు తిండిబెట్టేవోళ్ళు ఒకమాటనకుండా వుంటారా? మీ అమ్మయినా

ఒకమాటనదా? ఒక దెబ్బగొట్టదా? నువ్వు చిన్నమనిషివిగాదులే, ఆ నాయుడమ్మని ఎట్టంటే అట్ట మాట్లాడుంటావు... తక్కువైనదానివా? ఇక్కడ ఒకమ్మినే పెట్టుకోని చెయిలేక చస్తావుంటే నీ బుద్ధబెదిరింపుల్యాందిమే..."

అప్పుటికి సద్దికూట్యాళయింది. బర్రెల్నిప్పి పిచ్చిరెడ్డితోపుసాయ తోలకపోవాల్సిన రంగమ్మ పనిమర్చి చినమ్మసాయా, అక్కసాయా మార్చిమార్చి చూస్తావుంది. అక్క నాయుడోళ్ళింటికాడ పని చెయిలేనంటుంటే చినమ్మా, చిన్నాయినా పొమ్మని తొందరచెయిడం ఆ పిల్లకి బాధగా, దిగులుగా వుంది. అక్కకి అసలే కాలు అయిపు. ఆ యింట్లో బండచాకిరి. ఎంత చేసినా నాయుడమ్మ తిడతానే వుంటాది. 'నేను పోనని' గట్టిగా చెప్పమని అక్కకి సైగ చేసింది రంగమ్మ.

"కొండమ్మా నేన్చెప్పేదినుమే... ఆ నాయుడోళ్ళింట్లో వుండేగదా నువ్విన్ని ప్యాసన్లు నేర్చినావు... మనవనుకుందాం... గుడ్డెట్ట కట్టుకోవాలో, తలెట్ట దువ్వుకోవాలో, బొట్టెట్ట పెట్టుకోవాలో అన్నీ అయమ్మ దగ్గరేగదా నేర్చినావు... దినుమ్మూ నీళ్ళు పోసుకుంటుణ్ణామా మనింటికాడ... ఇదిగో తాగను సుక్కనీళ్ళు ల్యాక సస్తావుండాము... నువ్వన్నా లచ్చునంగా పెద్దోళ్ళింట్లో బతికిపోతావనుకుంటే మల్లిదేందిమే... మంచి యిల్లూ, మంచి తిండీ... నా మాటిని పదాంబా" మంచంమీద లేచి కూర్చున్నాడు తిరిపాలు.

రంగమ్మ అక్కమోచేతిని పొడస్తా ఎక్కేసింది వెళ్ళనని చెప్పమంటూ. కొండమ్మ గొంతు బిగబట్టుకుని ధైర్యాన్ని ఎరువు తెచ్చుకుంది.

"ఇదిగో చిన్నాయినా ... నువు మళ్ళీగన నన్నంపించాలని చూసినావంటే నేన్చెప్తుండా... చెరువుకట్ట మీద యాపచెట్టుకన్నా వురేసుకుంటా... ల్యాకపోతే పురుగులమందన్నా తాగేస్తా..."

"అవున్లే దూకిసావడానికి చెర్లో చుక్కనీళ్ళు ల్యాకపోయ..." అన్నం వారుస్తూ దెప్పిపొడిచింది మీరమ్మ... మీరమ్మకి వొళ్ళంతా సెగలు రేగినట్లై మంటలు పెడుతోంది... తన కూతుర్ని తొడకొచ్చి ఉగాదికి అన్నీ పెట్టి అంపించాల. ల్యాకపోతే అత్తోళ్ళింట్లో ఆయమ్మికి మాట... ఈ నడమ వూళ్ళో పనుల్లేక చేతిలో చిల్లిపైసా అన్నాలేదు. సరే... కొండమ్మ పనిచేసే కాడికిబోయి అయిదొందలడిగి తెచ్చుకుందామనుకుంట్రి మొగుడూ పెళ్ళాలు...

ఈయమ్మి గబక్కన చెప్పాపెట్టకుండా వచ్చేసిందిగాక మూడుదినాల్నుండీ రాయి మాదిరి తిని కూర్చోనుండాది, మాటాపలుకూ లేకుండా... యిహనేమి యిాబోతారోళ్ళు.

అసహాయతతో, ఏమీ చేయలేనితనంతో ఉద్రేకం పెరిగిపోయింది మీరమ్మకి.

"మీయమ్మా, నాయినా కని నా ఎదాన దోసిపోయినారే లంజిల్లారా... తిని కూసోనుండండి చేసిపెట్తాను. నాకు మాత్రముండాది కండల్లో సత్తువ..." ఇద్దరి మొహాలమీదా మెటికలు విరుస్తూ పైపైకి దూకింది మీరమ్మ.

అయితే కొండమ్మకీ, రంగమ్మకీ ఊహ తెలిసిన్నాటినుండీ మీరమ్మ ఈ మాటలంటానే వుండాది... ఈ పొద్దు కొత్తేంగాదు... కళ్ళు తుడుచుకుంది రంగమ్మ... కొండమ్మ మాత్రం స్పందనలేని స్థంభంలా నిలబడివుంది.

మీరమ్మ నోరునొప్పిపుట్టే దాకా అరిచి అరిచి గుడిసె లోపలికిబొయి ఎరగడ్డల పులుసు కలుపుకొచ్చి పొయిమీద పెట్టింది... అసలు అన్నం వార్చింది మొదలు ఇప్పటిదాకా ఉత్త పొయి పోవడం ఈ ముండల వల్చే అంది.

పొద్దట్నుండీ ఈ తిరణాలలోపడి బఱ్ఱెలకాడ పేడ జవరనందుకు తన్నుతాను తిట్టుకుంటూ పాతరేకుతో బరబరా కసువూ, పేడా లాగడం మొదలుపెట్టింది. నోరు మాత్రం ఆడతానే వుంది.

"మీ అమ్మా, నాయినా పోతాపోతా మిమ్మల్ని కూడా తీసుకుపొయ్యుంటే ఇట్లా మాటి మాటికీ ఈ బాధల్లేకుండా పొయ్యుండునన్నది. వీళ్ళిద్దరివల్లే తన ఒక్కగానొక్క కూతుర్నీ సరిగ్గా చూడలేకపోయానన్నది. ఈ రెండు పొట్టల్నీ అదనంగా నింపాల్సివచ్చినందువల్ల ఒక గుడ్డపాత కూడా కొనుక్కోలేకపోయానన్నది. ముగ్గురాడపిల్లలు ఇంట్లో వుండారని చిన్నప్పుడే మొగుడి పక్కన పడుకోవడం మానేశానన్నది. బతుకులో ఎన్నెన్నో పోగొట్టుకున్నవన్నీ ఏకరువుపెట్ట సాగిందామె.

మంచంమీద వెల్లకిలా పడుకుని చింతచెట్టు సందుల్లోనుండి ఆకాశానికేసి చూస్తున్న తిరిపాలుకి కూడా మీరమ్మ మాటల్లో పొల్లు కన్పించలేదు. అన్నా, వదినా వీళ్ళిద్దర్నీ తన మీదొదిలి ఈ లోకాన్నొదిలిపెట్టిపోయినప్పట్నుండి ఎన్నెన్ని బాధలుపడితే, ఎన్ని పస్తులుండి వాళ్ళ పొట్టలు నింపితే యింత పెద్దోళ్ళయినారు. కాలు అయిపు పిల్ల అని మరీ ఈ కొండమ్మని నెత్తిన పెట్టుకునేకదా సాకినాడు తను. కూలీనాలీ చెయిలేదని, బఱ్ఱెల కాడుండి బండచాకిరీ అసలే చెయిలేదని, ఈడుంటే వోళ్ళ చినమ్మ పిండేస్తాదే అనేగదా పేటలో యిటికసూల నాయుడోళ్ళింటికాడ పెట్టింది. ఆడకుబొయినాకే గదా ఇంత బాగ తీరింది పిల్ల. ఏదో నాయుడమ్మ దగ్గిర పనీబాటా నేర్చుకుంటాది, ఇంక రెండేళ్ళట్ట వుణ్ణిందంటే పెళ్ళిగూడా నాయుడమ్మే జేశాస్తాది, మనికి ఒక బాద్దిత తప్పినా తప్పతాది అని ఎంత ఆసపడ్డాడు. అట్టాటిదీయమ్మి ఒక్కమాటైనా చెప్పకుండా పరిగెత్తేసింది. వోళ్ళ నాయినయినా, మా నాయి నయినా ఈడేమయినా లిబ్బి పెట్టేసి పొయ్యుండారా? ఎంతెంత కష్టపడితే ఈ సంసారం లాగతుండాము.

ఏవన్నా పొలమూ పుట్రా వుండాదా? ఎంతసేపు ఆ కూలికి పోతేనే గదా పొట్టకూటికి. లేకుంటే పస్తులు పడుండాల్సిందే. ఆ కూలి పనైనా యాడ దొరకతా వుండాది. ఊరంతా తిండిబెట్టే పంటలు గాకుండా చెరుకేసేస్తిరి. ఆ చెరుకుతోటల్లో పని చేయడానికి అరవదేశా న్నుండి కూలోళ్ళొస్తుంటిరి. గవుర్మెంటు స్థలాలంటిరి. అయ్యి మనదాకా రాకపాయ. పనికి బియ్యావన్నారు. పనికి పిలవకుండానే మిషన్లతో పన్లయిపాయ. కరువు బియ్యమంటిరి కంటికే కనబడకపాయ. ఆఖరికాఖరికి తాగనుకూడా చుక్కనీళ్ళు లేకుండాపోతుండాయి.

నులక మంచంమీద వెనక్కివాలుకుని, బతుకులోతుల్లో నుండి ఆలోచిస్తోన్న తిరిపాలుని పెద్దదగ్గు తెర కమ్మేసింది. అట్లే ముందుకులేచి కూర్చుని దగ్గసాగాడు శక్తిలేనట్టుగా.

అసలే పీక్కుపోయివున్న తిరిపాలు బుగ్గలు మరింత లోతుకుపోయి, మొటికలు మొటికలుగా పెరిగిన తెల్లగడ్డంతో ముఖం భయంకరంగా కన్పిస్తోంది. ఎండుకుపోయిన డొక్కలు దగ్గు తీవ్రతకి ఎగిరెగిరిపడుతున్నాయి.

'మూడుదినాల్నుండి గమనించలేదుగానీ, చిన్నాయిన మరీ తగ్గిపొయ్యుండాడు' దిగులుగా తనలోతనే గొణుక్కుంది కొండమ్మ చిన్నాయిన వైపు చూస్తూ. ఎంత కాదనుకున్నా నాయిన తమ్ముడు... చిన్నప్పట్నుండి తనని సాకినోడు... అట్టాటి చిన్నాయిన మాటకాదని బాధపెడ్తుండానేమోనని, ఒక్కక్షణం ఆలోచనలోపడింది కొండమ్మ. ఆ క్షణాన్ని వినియోగించుకుంటూ మీరమ్మ ఎత్తుకొనింది... ఈసారి అనునయంగా.

"అమే ఈ ఒక్కసారికి నా మాటినుమే... పదాంబా నేనుగూడొస్తాను. నాయుడు భార్యకి చెప్పి వదిలిపెట్టొస్తాను. ఇదిగో మీ అక్కని పండక్కి తొడకరావాలని డబ్బులడిగి తెచ్చుకుంటాను" అంటూ బతిమాలుకుంది.

మీరమ్మ మాటలకి క్షణంపాటు కొండమ్మ మనసు కరిగింది. చినమ్మతోగూడా పొయి నాయుడోళ్ళనడిగి డబ్బులిప్పిస్తామా అన్పించింది. మరుక్షణంలో ఏమనుకుందో ఏమో విసురుగా లేచి చిన్న కానుగచెట్టు దాటి వాళ్ళ అత్తోళ్ళ యిళ్ళవైపు నడిచిపోసాగింది.

జారిపోయిన కోకని ఎగేసుకుంటూ మీరమ్మ నోరు తెరుచుకుని చూస్తుండిపోయింది. వెళ్ళిపోతూన్న అక్కనీ, నిర్ఘాంతపోయి నిలుచున్న చినమ్మనీ చూస్తూ సందిగ్ధంలో పడింది రంగమ్మ.

తిరిపాలు ఎడాతెరిపీ లేకుండా దగ్గుని అదుపులో పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ దగ్గు తాలూకూ బాధామయ శబ్దం దూరంగా వెళుతోన్న కొండమ్మ చెవుల్లో నుండి పాకి గుండెల్ని చుట్టేస్తోంది.

* * *

నక్కలకాలవలో చుక్కనీళ్ళు లేవు. సుద్దంగా ఎండిపోయి బాతులోళ్ళు కాపరాలు పెట్టేసుండారు. నేలంతా బీటలుపడి పిట్టలు తాగడానిక్కూడా బొట్టు నీళ్ళుండడంలేదు. తన చిన్నప్పుడు ఈ కాలవ ఎంత నిండుగా పొంగిపొరేది. ఈ కాలవలోనే తనూ, పక్కింటి, రవణమ్మా ఈత నేర్చుకునింది. బఱ్ఱెల్ని తోట్లోదోలేసి ఎంతసేపూ ఎండకి ఈ కాలవలోనే ఈదులాడుతుండేవాళ్ళు రవణమ్మా, తనూ.

దేశమ్మ చెరువులో కూడా నిండా నీళ్ళుండేవి. మెట్టనేలలే అయినా చెరువు ఏటా రెండుసార్లు నిండి పదహారొందల ఎకరాలకి బతుకయి వుండేది. అట్టాటిదిప్పుడు చెరువుల సేద్యాలే లేకుండా పోతుండాయి. బోర్లు, బోర్లని ఎంతెంత పొడుగు గొట్టాలేచ్చి నేలతల్లి గుండెల్లో దించినా గూడా చుక్కనీళ్ళు పైకిరాకపాయ. వానలొస్తేనేగదా నీళ్ళుండేదానికి. ఇంకా ఇంకా కొన్నేళ్ళుపోతే వానంటేనే తెలీకుండా పోతాదేమో...

వానవున్నా, లేకపోయినా ఈ తంగేడు చెట్లు మాత్రం యిరగబూసి వున్నాయి. వాటిమీద రంగు రంగుల సీతాకోకచిలకలు వాలి పులకరిస్తూ , రాగాలు తీస్తూ ఒక పూవుమీది నుండి మరో పూవు మీదికి, ఒక చెట్టు మీదనుండి మరో చెట్టు మీదకి పారాడుతున్నాయి. వాటిని చూస్తూ వుంటే తను కూడా ఏదో ఊపిరాడని చోటు నుండి వచ్చి హాయిగా యిక్కడ తిరుగు లాడుతున్నట్లుగా వుంది కొండమ్మకి. లేచి ఆ చెట్టు దగ్గరికి, ఈ చెట్టు దగ్గరికీ వెళ్ళి పలకరించింది.

కొండమ్మ చిన్నప్పుడు సావాసగత్తెలంతా తంగేడు చెట్టును దేవతగా భావించేవాళ్ళు. ఆ చెట్టు కనపడితే చాలు ఒక్కపూవ్వయినా కోసి తల్లో పెట్టుకోకపోతే ఆ తల్లికి కోపమొస్తుందనుకునే వాళ్ళు. ఇప్పుడు తలుచుకుంటే కొండమ్మకి నవ్వొస్తుంది. అయినా తంగేడుచెట్టు దగ్గరగా వెళ్ళి రెండు పూలు కోసి తల్లో పెట్టుకుని, రెండు చేతులూ జోడించింది.

దూరంగా పైరు కోసిన కయ్యిల్లో బర్రెల్ని మేపుతోన్న రంగమ్మ అక్క చెట్ల సందుల్లో నుండి పరుగులు పెట్టి తిరగడాన్ని, అక్క ఆనందాన్నీ ఆశ్చర్యంగా గమనిస్తోంది... అయినా చినమ్మ అక్కనిక్కడుండనీదు. మరుక్షణంలోనే నల్లగా వున్న రంగమ్మ ముఖం మరింత నల్లబడిపోయింది.

రాధామాధవ తీగల్లోనుండి రంగుపూలు కోస్తున్న కొండమ్మకి హఠాత్తుగా ప్రతిరోజూ దేవుడి కోసం పూలుకోసే నాయుడమ్మ గుర్తొచ్చింది. అక్కడ రాధామాధవ తీగని పడగ్గది కిటికీకి అల్లించారు. దీని పేరు రాధామాధవ తీగని నాయుడమ్మే చెప్పింది తనకి. నాయుడమ్మ యింకా చాలా చెప్పింది... చానా నేర్పింది. ఇంగ్లీషు పదాలు కూడా నాయుడమ్మ వద్దే నేర్చుకంది తను. రోజూ శుభ్రంగా స్నానంచేసి వుతికిన గుడ్డలేసుకోడం, సబ్బుతో వళ్ళు రుద్దుకోడం, కాళ్ళకి చెప్పులేసుకోడం, తలకి పిన్నులేసుకోడం, గోళ్ళకి రంగు పెట్టుకోడం యివన్నీ కూడా నాయుడమ్మని చూసే నేర్చుకుంది తను. అయితే మాత్రం తనేవన్నా పన్జేయకుండా డబ్బులు తీసుకుంటుండాదా?

కాలు ఇట్ట పెట్టుకోనిగూడా పొద్దనలేసింది మొదలూ, రాత్రి పదిగంటలదాకా నాయుడమ్మ ఏ పని చెప్తే ఆపని చేసేది. ఒక్క నాయుడమ్మేనా? యింట్లో ఎంతమందుంటే అంతమంది... ఎన్ని పక్కలకి పిలిస్తే అన్ని పక్కలకీ పరిగెత్తాల్సిందే. పాలుమాలేదానికే లేదు . యిల్లూ వాకిలీ పొద్దనా, సాయంత్రం చిమ్మాలి. యిల్లంతా రూమురూముల్లో తడిగుడ్డతో శుభ్రంగా తుడిచి సర్దాలి. పైన చిమ్ముకురావాల. ముందు వెనకా వుండే చెట్లకీ, లానుకీ దండిగా నీళ్ళుపట్టాల. గుడ్డలుతకాల. యింత చేస్తే గూడా అత్తా , కోడళ్ళిద్దరూ దేనికోవకదానికి నస పెడ్తానే వుంటారు. ఎంత చేసినా యింకా అది చెయిలేదు, యిది చెయిలేదు అంటా వెంటపడతారు. మాట్లాడితే ఎదురుతిరిగి మాట్లాడిందంటారు. పలక్కపోతే జవాబు చెప్పవేమని గదమాయిస్తారు.

పిల్లలుకూడా అంతే. ప్రతిదానికీ దబాయిస్తారు. రాపాడతారు. మాట్లాడేదానికిల్యా మాట్లాడకుండా వుండేదానికీల్యా. ఈ నాలుగుదినాల్నుండీ లానుకి నీళ్ళెవురు పడ్తుండారో బాత్రూములెవురు కడగతుండారో. వాకిట్లో ముగ్గు ఎవురేస్తుండారో.

ఇదంతా అట్టుంటే అప్పుడప్పుడూ నాయుడమ్మ తమ్ముడొస్తాడు. పనున్నా, లేకపోయినా బెడ్రూములోకి పిలుస్తుంటాడు ఏదోవక సాకుపెట్టి. వాడొస్తుండాడంటేనే భయం. తప్పిచ్చుకు తప్పిచ్చుకు తిరగతుండాల. డబ్బు లేకపోతే, కాలు లేకపోతే మనిషికి మనసుండదా, నీతి వుండదా? త్ఫూ... నాయుడమ్మ నసే భరించలేక సస్తుంటే వీడొకడు ప్రాణానికి. ఎందుకొచ్చిన బాధ. ఎంత తిండిపెట్టి గుడ్డలిస్తే మాత్రం మనిషికి మించి చాకిరీ చెయ్యాలంటే అవతాదా? చేసీగూడా ఏమన్నా వూరా పేరా? మెచ్చుకోకపోగా వకటే నసపెడ్తానే వుంటారు. ఒకపూట అన్నం లేకపోయినా పడుండొచ్చుగానీ వక్కమాటంటే పడదు తను.

అట్టని ఈడ్నే వుండాలంటే అవతాదా? తనకేవయినా అమ్మ, నాయినా వుండారా? కూచనబెట్టి పెట్టడానికి. ఎప్పుడో చచ్చిపోయిన తల్లితండ్రులు గుర్తొచ్చి కళ్ళల్లో నీళ్ళూరాయి కొండమ్మకి. రంగమ్మ నొకదాన్నే చూడ్డానికి చినమ్మ ఎన్నెన్ని మాటలడగతాది ? చిన్నాయిన చూస్తే శక్తి తగ్గిపోయి పనికి పోలేకుండా వుండాడు. చినమ్మ మాత్రం ఎంతకని చేస్తాది. పోనీ ఈడ్నే వుండి రవణారెడ్డోరింట్లో పనికి కుదిరితే పొద్దనబోయి సాయంత్రమొచ్చేయొచ్చు.

“రంగమ్మా రవణారెడ్డోరింట్లో ఎవురుండారు పనికి? ఆ రెడ్డెమ్మ నన్ను పనికి రమ్మన పిలిచేది అంతకుముందు... ” చెల్లెలి దగ్గరగా వెళ్ళి ప్రశ్నించింది కొండమ్మ.

రంగమ్మ పెదవి విరిచింది. చేతులు తిప్పుతూ...

“ఇంక్యాడ రవణారెడ్డికా... మందు తాగి సచ్చిపోయినాడు. రెడ్డెమ్మ యిప్పుడిక్కడ లేదు. కొడుక్కాడికెళ్ళిపోయింది. పాపం చెనిగేసినాడుకా. బాగా వచ్చుణ్ణింది. నీళ్ళు చాలక మందు కొట్టినా తెగులు చావనే లేదంట. మొత్తం ఎనిమిదెకరాలూ నిలవనెండిపోయింది. ఏం చేస్తాడు చెప్పు? పోయినేడుగూడా పంట చేతికిరాల్యా. మందుతాగి అదుగో ఆ కయ్యిలోనే పడిపోయినాడు. పాపం పెదరెడ్డి ఎంత బతుకు బతికినాడు?. ఎట్టంతా అవునన్పించుకున్నాడు” ఆరిందాలా చెప్తూ కళ్ళు తుడుచుకుంది రంగమ్మ.

నిర్ఘాంతపోయి చూస్తోంది కొండమ్మ...

“మనం చెయ్యాలన్నా కూడా పనుల్లేవుకా... వానలు పడితేగదా కయ్యలు దున్నేదానికి. టవున్లోనే మేలుపో. హే... హే... హే...” పక్కకి పోతోన్న బర్రెల్ని మల్లిస్తూ మళ్ళీ దూరంగా వెళ్ళింది రంగమ్మ. ఆలోచనలోపడింది కొండమ్మ.

ఏం చెయ్యాల?

నాయుడమ్మ పిలకాయిల్ని తను రోజూ బడికి తీసకపొయ్యేది. ఆ టీచరమ్మ తనని ఆయాగా వచ్చి చేరమని చానారోజులుగా పిలస్తుండాది. ఆమె దగ్గరికెళ్ళాల్సిందే... యింక్యాడికి

బొయినా ఈ కాలు చూసి పనీయరు. అక్కడికిపోతే పని మరీ జాస్తిగా వుండబోద్ది. జాస్తయినా పర్వాల్యా... ఎంత పనయినా చేస్తాది. మాటంటే మాత్రం వోర్చుకోలేదు.

కొండమ్మ కలగాపులమైన ఆలోచనలని అడ్డుకుంటూ "పొద్దుపోతా వుండాది, యిహన పోదాంరాక్కా" పిలిచింది రంగమ్మ.

బయిటి ప్రపంచానికి వెలుతురుగా వున్న ఆ సాయంత్రం ఆ అడవిలో మాత్రం తొందరగా చీకట్లని కమ్మేసింది.

* * *

సూర్యుడు భూలోకం మీదికి విహారానికొస్తున్నందుకు సాక్షిగా ముందుగా సనసన్నటి వెలుగురేఖలు లోకంమీదికి పారాడుతున్నాయి.

"ఒరే తిరిపాలా... కొండమ్మ యాడ్రా వుండేదిప్పుడు? ఆ నాయుడోళ్ళింట్లోనేనా..." మూడో యింట్లో వుండే వెంకటయ్య హడావుడిగా వచ్చి ప్రశ్నించాడు.

చిన్నదూడ మూతికి చిక్కం కడుతూన్న తిరిపాలు మెల్లిగా మోకాళ్ళు సవరదీసుకుంటూ లేచి నిలబడ్డాడు.

"నాయుడోళ్ళింట్లో లేదు వెంకటన్నా... ఎంతచెప్పినా యినకపోయె... బడి సాయిత్రమ్మ టీచరు కాడుండాది. పిలకాయిల్ని బడికి తొడకరానూ, వదిలిపెట్టనూ, ముద్ది కడగనూ, బడి చిమ్మనూ చెయినూ... చస్తా వుండాదనుకో... చెయిలేకుంటుండాదని ఆడ్యాడ్నో బేరిపేటలో పెద్ద మిస్సమ్మ కాడ పెడతాణంటుణ్ణింది సాయిత్రమ్మ" తాపీగా చెప్తోన్న తిరిపాలు కేసి చూస్తూ...

"యిహనేమి కొండమ్మోరే ... ఆ బేరిపేట్లో పెద్ద మిస్సమ్మ, అదేన్రా సొందాయమ్మ పనికి, పనికని పెట్టుకోని ఎడ పిలకాయల్ని అయిదారాబాదులో అమ్మేస్తుండాదంట. ఆమె మొగుడే ఈ పన్లన్నీ చేయిస్తుండాడంట. ఈ పొద్దు పేపర్ల నిండా అదేనంట. నాయుడుపేటంతా గబ్బుపుట్టి పొయ్యుండాదనుకో. రెడ్డోరింటికాడ చెప్పుకుంటుంటే యిని ఇట్ట పరిగెత్తినా కొండమ్మ్యాడుండాదా అని"

తిరిపాలుకి కాళ్ళూ, చేతులూ ఆడలేదు. ఊపిరి తిప్పుకోనీయని దగ్గుని లెక్కచెయ్యకుండా, పై గుడ్డ వుందో లేదో చూసుకోకుండా, బనీను జోబులో చిల్లరుందో లేదో గమనించుకోకుండా బస్టాండుకి పరుగెత్తాడు.

పేరు తెలీని పక్షేదో వికారంగా అరుచుకుంటూ ఆకాశంలో పడమటివైపు నుండి తూర్పుమూలగా పరుగెత్తుకుంటూ వెళ్ళింది.

బర్రెలకాడ పేడ జవురుతుండిన రంగమ్మ 'ఓ'మంటూ ఏడుపుకెత్తుకుంది అర్ధమయ్యీ కాకుండానే. కొళాయినీళ్ళు పట్టుకొచ్చి సిమెంటు తొట్టిలో నింపుకుంటూండిన మీరమ్మకి కూడా దిక్కుతోచలేదు. నాయుడింటినుండి వచ్చేసిన కొండమ్మని తిట్టి, తిట్టి మళ్ళీ పనిలోకి

పంపినందుకు తనలోతానే నొచ్చుకుంది. ఇక్కడే వుండనిచ్చివుంటే ఏదో వొక పనీపాటా చేసుకు నుండేదికదా అనుకుంది. ఏడుస్తోన్న రంగమ్మని వోదార్చాలనికూడా తోచలేదామెకి. బస్సు కాడికి పరుగెడుతోన్న మొగుడికి యిది బస్సు టయిము కాదనికూడా చెప్పాలనిపించలేదు. నిండు బిందె చంకనుంది. దాన్ని దించాలన్న ఆలోచనకూడా లేకుండా వొంటికతుక్కుపోయిన తడి చీరతో, కొండమ్మ తాలూకూ పశ్చాత్తాపచింతనతో నిరామయంగా చూస్తుండిపోయింది మీరమ్మ.

రంగమ్మ ఏడుపుతో యిరుగు పొరుగూ అంతా యింటి ముందు చేరారు. మనుషుల్ని వస్తువుల మాదిరి అమ్మేసే యిటువంటి ఉదంతాన్ని వాళ్ళీదివరకెన్నడూ వినివుండకపోవడంతో అంతా నివ్వెరపోయి రంగమ్మని ఏం చెప్పి వోదార్చాలో తెలీక తికమకపడసాగారు.

"ఆడ్యాడ్నో యిట్ట జరగతాయని యిన్నాంగానీ మనూళ్ళో, మన పేటలో కూడా యిట్టాటిది జరగతాదని అనుకోల్యా. మనోళ్ళ చెంగమ్మ కొడుకు నాయుడుపేటలో సూల పని చేయడానికి దినుమ్మూ పొయ్యేసొస్తాడు. ఆ మిస్సమ్మ... పెద్ద మిస్సమ్మకి ఎంత పేరుండాది అందర్లో... మంచి వుద్యోగం చేస్తా గొప్పగా బతుకుతుండె ఆయమ్మకిదేం బుద్ధో?..."

"ఆ పొయ్యేకాలమొస్తే కుక్కమూతిపిందెలు పుడతాయంటారు ఇదే గదా... ల్యాకుంటే ఆ నాయుడోళ్ళింటికాడ లచ్చనంగా పడుండకుండా ఈ మిస్సమ్మింటికి దేనికి పొయినట్టు ఈ కొండమ్మ..."

"అయ్యో నా తల్లా కొండమ్మా ఎంతపని జరిగిపొయిందమ్మే... ఇంత పొట్టకూటికి గతిలేక నువ్వాడ్యాడ్నో ఎందుకుండాల... నా కాడుండు... నువ్వెవురి యిళ్ళకాడా వుండబళ్ళే దంటినే... నా మాటినకుండా పోతివే. కొండమ్మా నా కోడలా ఎంత పని జరిగిపొయిందమ్మే" కొండమ్మ మేనత్త శవంమీద పడి ఏడిచే ఏడుపు రాగంతో పరుగెత్తుకొచ్చింది.

మీరమ్మకి దిగులుపోయి వళ్ళుమండుకొచ్చింది. ఈ పిలకాయల అమ్మానాయినా పొయ్యినప్పట్నుండీ యా పొద్దూ రంగమ్మనీ, కొండమ్మనీ యిటుకుండ రమ్మని పిల్చెరగదు. ఆమద్దిన గవుర్మెంటు అయిపు కాలోళ్ళకి డబ్బులిస్తుండాదని అప్పుడు తీసకపొయ్యి నాలుగు దినాలుండిచ్చుకుంది. గవర్మెంటు డబ్బులిచ్చేది నీళ్ళమీద రాసుకున్నాక వదిలిచ్చేసుకుంది. అట్టాటి మేనత్త కొండమ్మ కోసం యాడస్తా రావడం మీరమ్మని దోషిని చేయడానికేనని అందరికీ అర్థమవుతానే వుంది .

రంగమ్మ ఏడస్తానే వుంది సన్నగా...

ఆ ఏడుపు వున్న ఒక్కగానొక్క బంధాన్ని పుటుక్కున తెంచేసిన ఎవరిమీదో తెలీని కోపాలాపనలాగుంది.

ఎవురి బాధల్నీ, సంతోషాలనీ పట్టించుకోని సూర్యుడు ఆరోజు కూడా మామూలుగానే పశ్చిమకొండల్లోకి వెళ్ళిపోయాడు.

* * *

నాలిక గొంతులోకి దిగబీకతావుంది. కళ్ళు ముచ్చిన గుంటలోకి ఈడ్చుకుపోయాయి. మూడుదినాల్నాడు వెంకటయ్యొచ్చి కొండమ్మ మాట చెప్పకముందు తాగిన దాహం. మొన్న పొద్దట్నుండీ కొండమ్మకోసం తిరిగి తిరిగీ అరిగిపోయిన కాళ్ళు, మన సొరంతులోనే లేకుండా పేట బస్టాండులో బెంచిమీద పడున్న తిరిపాలుని నెల్లూరు నుంచి బస్సు దిగిన రాగయ్య చూసి నీళ్ళు చల్లి, సోడా తాగించి మెల్లిగా బస్సెక్కించి వూరికి తీసుకొచ్చాడు.

బస్సులో వచ్చినంతసేపూ కొండమ్మమాటే కలవరిస్తుండాడు తిరిపాలు.

తాళాలు బిగించేసిన సాయిత్రమ్మ బడి చుట్టూ... పోలీసులు చుట్టుముట్టిన సొందా యమ్మ యింటిచుట్టూ ఆసుపోసినట్లుగా ఎట్ట తిరిగిందీ చెప్పాడు. పక్కనా యిక్కనా ఒక్కరన్నా ముండాగుంపు కొండమ్మ పొపిడి యివ్వలేదనీ, టవున్లో మనమాటినేవోళ్లెవురన్నాడు. పోలీసు లుండేది పేదోళ్ళకోసం కాదు పెద్దోళ్ళకోసవన్నాడు. పోలీసులు తనమాట పట్టిచ్చుకోకుండా ఎట్ట తరిమికొట్టిందీ చెప్పాడు. అది రాగయ్యా అన్నాడు... యిది రాగయ్యా అన్నాడు...

ఏడ్చి ఏడ్చి నీళ్ళే లేకుండాపోయిన కళ్ళల్లో యింక నెత్తురుబొట్లు కారతాయేమోనని పూరుకున్నాడు. ఆ నెత్తురు కూడా తన వొంట్లో లేదన్న ఆలోచనయితే రాలేదు తిరిపాలుకి.

నాలుగురోజుల ముందు నెల్లూరుకి పోయిన రాగయ్యకి విషయం పూర్తిగా తెలీక పోయినా కొంత కొంత అర్థమయి తిరిపాలుని వోదార్చాడు.

* * *

"ఓయమ్మో... నా దేవుడికేవయిందమ్మో" రాగయ్య భుజానికతికించుకుని వేళాడు కుంటూ తీసుకొస్తోన్న తిరిపాలుని చూసి మీరమ్మ మతిపోయింది. నడుస్తున్న శవంలాంటి తిరిపాలునీ, రాగయ్యనీ మార్చిమార్చి చూస్తూ ఏడుపుకెత్తుకునింది.

తిరిపాలుని మెల్లిగా వాకిట్లోవున్న నులకమంచంమీద కూర్చోపెట్టాడు రాగయ్య. పేట బస్టాండులో తిరిపాలుని ఏ పరిస్థితుల్లో తాను చూసిందీ క్లుప్తంగా చెప్పి మంచినీళ్ళు పట్రమ్మ న్నాడు. మీరమ్మ మంచినీళ్ళు తెచ్చిచ్చి

"యాందయ్యా యాడకు బొయినావు. అయమ్మి మాట అట్టుండిచ్చి నిన్ను గురించి యాడవను సరిపాయనే నాకు. ఎట్టబొయినావో ఏమోనని" ఒకవైపు మొగుడ్ని దబాయిస్తూనే మరోవంక పమిటచెంగుతో ముక్కును ఎగబీలుస్తోంది మీరమ్మ.

పెళ్ళాం మాటలేవీ విన్పించుకోకుండా ఆలోచనలోవున్న తిరిపాలుకి హఠాత్తుగా రంగమ్మ జ్ఞాపకానికొచ్చింది. అక్క కన్పడలేదని ఈయమ్మి ఎట్టబొయ్యిందో, ఏమయిపోయిందో అనుకుంటూ చుట్టూ కలయచూశాడు.

అప్పటికి పొద్దు గూట్లో పడతావుంది.

దూరంగా బర్రెల్ని అదిలిస్తూ యింటికి తోలుకొస్తావుండాది రంగమ్మ. తేలిగ్గా వూపిరి పీల్చి అట్నే దృష్టి సారించిన తిరిపాలు వీధిచివర కన్పించిన దృశ్యాన్ని చూసి విచిత్రపొయ్యాడు.

వీధిచివర... అటు వూరికీ యిటు మాలాడకీ సాదువుగా వున్న చింతచెట్టు కింద అరుగుపక్కన బంకులో కూర్చుని అంగడమ్ముకుంటూ వుంది కొండమ్మ.

మసక చీకట్లో కొండమ్మా, కాదా అనుకుంటూ కళ్ళు చికిలించిన తిరిపాలుని గమనిస్తూ "మన కొండమ్మే... సాయిత్రమ్మ టీచరుకాడ్నే వుణ్ణిందంట. పెద్ద మిస్సుకాడికి బోలే. యింత లోపల పోలీసులొచ్చి సాందాయమ్మనీ, మొగుడ్నీ పట్టకపొయినారు. దాంతో లింకుండా దేమోనని అనుమానంతో సాయిత్రమ్మని కూడా టేషనుకి పిల్చకపొయినారంట... సరే బడి మూసేసినారు. ఎట్నో వోళ్ళనీ, యీళ్ళనీ డబ్బులడిగి బస్సెక్కి వచ్చేసింది. మనదృష్టంబో... ఈ లోపల్నే నువ్వుబొయ్యి అన్ని దేశాలూ చుట్టేసొస్తివి" వెటకారంగా అంది మీరమ్మ.

మళ్ళీ తనే చెప్పింది

"నాయుడమ్మ తీసిచ్చిన కమ్మలు కుదవబెట్టి నేనే మాధవయ్య బంకు కొనిచ్చినా. యింక్యామయినా యీయాల్సుంటే తర్వాతిస్తాదన్నా..."

మాట మాత్రమే కరుకయిన మీరమ్మకేసి ఆదరంగా చూశాడు తిరిపాలు. కృతజ్ఞతా భావంతో అతడి గుండె కదలబారింది. ఒక భారమైన, దీర్ఘమైన నిట్టూర్పు విడిచి మళ్ళీ వీధి చివరకేసి దృష్టి సారించాడు తిరిపాలు. ఒకప్పుడు అంగడి పెట్టిస్తానంటే మొరాయించిన కొండమ్మ ఊరికి చివరగా మాలాడ మొదట్లో వున్న ఆ చింతచెట్టు కింద కొండమ్మ ఆలోచనలు ననలెత్తి ఆమె భవిష్యత్తు కొత్తబట్టలు తొడుక్కుంటూంది. సాయంత్రం ఏడైపోయినా వేసవికాలం కావడంతో పల్చటి వెలుతురు కిరణాలు ఆ మాలాడ మీద ప్రసరిస్తున్నాయి.

ఇక యింటికెళ్ళే సమయమైందని కాబోలు చింతచెట్టు మీదనున్న సీతాకోకచిలుకల గుంపొకటి ఉవ్వెత్తున విశాలమైన ఆకాశంలోకి ఎగిరింది.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఆగస్టు 22, 2003